క్లుప్తంగా

రాష్ట్రస్థాయి పోటీలకు గొల్లపల్లి విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

పుత్తూరు రూరల్: రాష్ట్రస్థాయి బేస్‌బాల్ పోటీలకు పుత్తూరు మండలం గొల్లపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికై నట్లు హెచ్‌ఎం భారతి తెలిపారు. మంగళవారం పాఠశాలలో పోటీలకు ఎంపికైన విద్యార్థులను ఉపాధ్యాయ బృందం అభినందించింది. హెచ్‌ఎం మాట్లాడుతూ తిరుపతి మంగళం ట్రెండ్స్‌లో నిర్వహించిన అండర్–14 బేస్‌బాల్ పోటీలలో పాఠశాలకు చెందిన చంద్రకళ, నాగ చైతన్య మంచి ప్రతిభ కనబరిచి రాష్ట్ర పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. నవంబర్ నెలలో గుంటూరులో జరిగే రాష్ట్ర పోటీల్లో వీరు పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో పీడీ గోపికృష్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నెల్లేపల్లి విద్యార్థులు సైతం..



పోటీలకు ఎంపికైన విద్యార్థులతో టీచర్లు

గంగాధర నెల్లూరు: మండలంలోని నెల్లేపల్లి పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు రాష్ట్ర స్థాయి అండర్–14 వాలీబాల్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల హెచ్‌ఎం సుబ్బరత్నమ్మ తెలిపారు. ఈ నెల 20వ తేదీన విశాఖ జిల్లా, అరకులో జరిగే పోటీలకు తమ స్కూల్ విద్యార్థులు వందన, కార్తీక్ చిత్తూరు జిల్లా తరపున ఎంపికైనట్లు చెప్పారు. విద్యార్థులు చదువుల్లోనే కాదు, క్రీడల్లో కుడా అగ్రగామిగా నిలవడం ఆనందంగా ఉందన్నారు. అనంతరం రాష్ట్రస్థాయి పోటీలకు వెళ్తున్న పిల్లలకు పాఠశాల తరపున ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

పోస్టర్ల ఆవిష్కరణ



జనవిజ్ఞాన వేదిక సంబరాల పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎంఈఓలు

కార్వేటినగరం: చెకుముకి సైన్స్ సంబరాల పోస్టర్‌ను మంగళవారం మండల విద్యావనరుల కార్యాలయంలో ఎంఈఓలు విజయకుమార్, మనోజ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చెకుముకి పోటీలు నవంబర్ 10వ తేదీన పాఠశాల స్థాయిలో, నవంబర్ 30న మండల స్థాయిలో, డిసెంబర్ 17న రాష్ట్రస్థాయిలో జరుగుతాయని తెలిపారు. అనంతరం పుత్తూరు జనవిజ్ఞాన వేదిక కన్వీనర్ వేణుగోపాల్ మాట్లాడుతూ 2024 జనవరిలో 27, 28 తేదీల్లో కూడా రాష్ట్ర స్థాయిలో చెకుముకి సంబరాలు జరుగుతాయన్నారు. కార్యక్రమంలో జేవీవీ నాయకులు శేఖర్, వేణుగోపాల్‌రెడ్డి, శశికపూర్, మునేంద్ర, రేఖ, లీలా పాల్గొన్నారు.

నగరి: ఎంపీడీఓ కార్యాలయంలో సమైక్యతా ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు



కార్వేటినగరం : మానవహారం నిర్వహిస్తున్న విద్యార్థులు



పెనుమూరు: జూనియర్ కళాశాల విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ప్రిన్సిపల్



ఆదర్శప్రాయుడు సర్దార్ వల్లభాయ్ పటేల్

- స్వదేశీ సంస్థానాలను విలీనం చేసిన మహనీయుడు సర్దార్ వల్లభాయ్
- నేటి యువత ఉక్కు మనిషి అడుగు జాడల్లో నడవాలి
- వక్తల పిలుపు

పుత్తూరు రూరల్: భారతదేశ ఉక్కు మనిషి, భారతరత్న సర్దార్ వల్లభాయ్ పటేల్ అందరికీ ఆదర్శప్రాయుడని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి.శ్రీనివాసులురెడ్డి అన్నారు. మంగళవారం కళాశాలలో పటేల్ జయంతి సందర్భంగా ''జాతీయ ఐక్యతా దినోత్సవం'' ఘనంగా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత స్వదేశీ సంస్థానాలను భారత్‌తో విలీనం చేసిన మహనీయుడు సర్దార్ వల్లభాయ్ పటేల్ అని కొనియాడారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ఐక్యతా ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం విద్యార్థులు ప్లకార్డులు చేతపట్టి పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ అధికారులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

శ్రీరంగరాజపురంలో..

శ్రీరంగరాజపురం : దేశ సమైక్యతకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని తహసీల్దార్ బెన్నురాజు అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం భారతదేశ ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. నవభారత నిర్మాణానికి నాంది పలికిన అపర చాణిక్యుడు అని కొనియాడారు. అనంతరం ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కృష్ణయ్య, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

స్వరాజ్య ఏకీకరణలో చేసిన పటేల్

నగరి : భారత దేశపు ఉక్కుమనిషిగా పేరుగాంచిన సర్దార్ వల్లభాయ్ పటేల్ స్వాతంత్ర్య సమరయోధులే కాక స్వరాజ్య ఏకీకరణ చేసిన గొప్ప వ్యక్తి అని ఎంపీడీఓ లీలామాధవి అన్నారు. మంగళవారం భారతదేశపు మొదటి ప్రధాని సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి సందర్భంగా జాతీయ ఐక్యతా దినోత్సవాన్ని స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వల్లభాయ్ పటేల్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన 15 నెలల్లోనే 562 సంస్థానాలను భారతీయ యూనియన్లలో విలీనం చేయడంలో పటేల్ పాత్ర చిరస్మరణీయం అన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కన్నియప్ప, ఎంపీటీసీ యేసు, ఏఈ సురేంద్ర, సర్పంచ్ వినోద్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు. స్థానిక డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపల్ డాక్టర్ వేణుగోపాల్ విద్యార్థులచే సమైఖ్యతా ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ అధికారి డాక్టర్ భాస్కర్‌రాజు, ఎన్‌సీసీ అధికారి లెఫ్టినెంట్ భాస్కర్, ఐక్యూ కోర్డినేటర్ ఇందిరాప్రియదర్శిని, అధ్యాపకులు పాల్గొన్నారు.

కార్వేటినగరం, పెనుమూరులో..

పెనుమూరు(కార్వేటినగరం): భారతదేశానికి స్వాతంత్ర్య సాధనలో, దేశానికి మొదటి ఉప ప్రధానిగా, హోంమంత్రిగా ఉన్నప్పుడు పాకిస్తాన్‌తో జరిగిన యుద్ధంలో మన దేశం విజయం సాధించడంలో సర్దార్ వల్లభాయ్ పటేల్ కృషి ఎనలేనిదని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ బాలసుబ్రమణ్యంరాజు అన్నారు. మంగళవారం కళాశాలలో జాతీయ ఐక్యతా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.

కులమతాలకు అతీతంగా ఉందాం..

మానవులంతా కులమతాలకు అతీతంగా జీవనం సాగించాలని కార్వేటినగరం ప్రభుత్వ డిగ్రీకళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ విజయులురెడ్డి అన్నారు. మంగళవారం సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకుని కళాశాల నుంచి నగరం వరకు విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, పాల్గొన్నారు. అలాగే డీఎం పురం ఉన్నత పాఠశాలలో ఇన్‌చార్జి హెచ్‌ఎం రంజిత్‌కుమార్ ఆధ్వర్యంలో జాతీయ ఐక్యతా దినోత్సవాన్ని నిర్వహించారు.

పాలసముద్రంలో..

పాలసముద్రం : మండలకేంద్రంలోని పాలసముద్రం సచివాలయంలో జెడ్పీటీసీ సభ్యుడు అన్బళగన్, సర్పంచ్ అయ్యప్ప ఆధ్వర్యంలో సర్దార్ వల్లభాయ్ పటేల్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఐక్యతా ప్రతిజ్ఞ చేసి మండల కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఎంపీటీసీ గోవిందరాజ్, ఎంపీడీఓ ప్రేమ్‌రాజ్ కుమార్, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

మహిళల నిరసన

పాలసముద్రం: మండలంలోని సప్తగిరి గ్రామీణ బ్యాంకు అధికారులు డ్వాక్రా సంఘాలకు ఇచ్చి లింకేజీ రుణాలు ఇవ్వడం లేదని మంగళవారం డ్వాక్రా మహిళలు నిరసన చేపట్టారు. గత మూడు నెలలుగా రుణాల కోసం బ్యాంకుల చుట్టు తిరుగుతున్నా బ్యాంకు డ్వాక్రా మహిళలు పట్టించుకోవడం లేదని వాపోయారు. ప్రభుత్వం డ్వాక్రా మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలనే ఉద్దేశంతో ఒక్కొక్కరికి రూ.లక్ష నుంచి రూ.1.50 లక్షలు ఇవ్వాలని చెబుతున్నా, పాలసముద్రం సప్తగిరి బ్యాంకు ఉద్యోగులు మాత్రం పట్టించుకోవడం లేదన్నారు. మండలంలో సుమారు 50 గ్రూపుల సభ్యులు గతంలో తీసుకున్న రుణాలు తిరిగి చెల్లించారని, మళ్లీ ఇప్పుడు కొత్త రుణాల కోసం బ్యాంకు చుట్టూ తిరుగుతున్నా స్పందించడం లేదని వాపోయారు. మండలంలో సప్తగిరి బ్యాంక్ ఒకటే ఉందని, అందులో కూడా రుణాలు ఇవ్వకపోతే ఎలా అని ప్రశ్నించారు. ఇప్పటికైనా సప్తగిరి బ్యాంకు ఉన్నతాధికారులు స్పందించి డ్వాక్రా మహిళల సమస్యలను పరిష్కరించాలని తెలిపారు.

ప్రాధాన్యతానుసారం అభివృద్ధి పనులు



సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ నీలమేఘం

నగరి : మున్సిపల్ పరిధిలో రూ.5 కోట్ల మేర అభివృద్ధి పనులు జరగనున్నాయని మున్సిపల్ చైర్మన్ పీజీ నీలమేఘం అన్నారు. మంగళవారం నగరి మున్సిపల్ కార్యాలయంలో జరిగిన సాధారణ సమావేశంలో ఆయన ప్రసంగించారు. మున్సిపల్ కమిషనర్ వెంకట్రామిరెడ్డి సమావేశపు అజెండాను సభ్యులకు చదివి వినిపించారు. అజెండాలో ఏవైనా అభ్యంతరాలుంటే తెలపాలన్నారు. ఈ సందర్భంగా విప్ దయానిధి మాట్లాడుతూ జగనన్న కాలనీలో ఇంకా ఇల్లు నిర్మించుకోని లబ్ధిదారుల వివరాలు తెలపాలన్నారు. అందులో ఆసక్తి లేనివారిని తప్పించి ఇతరులకు అవకాశమివ్వాలని కోరారు. కౌన్సిలర్లు తమ వార్డుల్లో చేపట్టవలసిన కొన్ని అభివృద్ధి పనులను చైర్మన్ దృష్టికి తెచ్చారు. దీనిపై మున్సిపల్ చైర్మన్ మాట్లాడుతూ మంత్రి ఆర్కేరోజా సహకారంతో మున్సిపల్ పరిధిలో అన్ని వార్డుల్లో ప్రాధాన్యతానుసారం ప్రజావసరాలకు తగిన వి ధంగా అభివృద్ధి పనులు చేస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో వైస్ చైర్మన్లు బాలన్, వెంకటరత్నం, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యు లు, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పట్టు సాగుతో గిట్టుబాటు

శ్రీరంగరాజపురం : పట్టుసాగును రైతులు సాగు చేయడం ద్వారా మంచి గిట్టుబాటు వస్తుందని అధిక లాభాలను పొందవచ్చని జిల్లా సెరికల్చర్ అసిస్టెంట్ డైరెక్టర్ మేనాటి మోహన్‌బాబు అన్నారు. మండలంలోని తయ్యూరు రైతుభరోసా కేంద్రంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పట్టు పరిశ్రమల శాఖ రాష్ట్రీయ కృషి వికాష్ యోజన పథకం ద్వారా వైఎస్సార్ పట్టుబడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు పట్టు పరిశ్రమ, వాటి సాగుపై ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మల్బరీ సాగు చేయడం ద్వారా ఎకరాకు సంవత్సరానికి ఐదు పంటలను సాగు చేయవచ్చని, దాదాపు రూ.2 లక్షల వరకు ఆదాయం పొందవచ్చన్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో కేజీ రూ.450 నుంచి రూ.500 వరకు ఉందన్నారు.

రాయితీ వివరాలు..

1. మల్బరీ మొక్కలు పెంచే రైతులకు ఎకరాకు రూ.18,750, రేరింగ్ షెడ్ నిర్మాణానికి రూ.3 లక్షలు రాయితీ వర్తిస్తుందన్నారు.
2. ఎస్సీ,ఎస్టీ రైతులకు ఒక ఎకరానికి రూ.22,500, రేరింగ్ షెడ్ నిర్మాణానికి రూ.3,60,000 రాయితీ ఉందన్నారు.
3. పరికరాలకు రూ.67,200 ఇవ్వడం జరుగుతుందన్నారు. అలాగే సన్నకారు రైతులకు మల్బరీ తోట సాగు చేయడానికి ఉపాధిహామీ పథకం ద్వారా ఆర్థిక సహాయం అందిస్తుందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ సరిత, సర్పంచులు వరదమ్మ, ఉమామహేశ్వరి, నాయకులు, రైతులు, వలంటీర్లు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్ష పేదలకు వరం



ఐసీడీఎస్ సిబ్బంది ఏర్పాటు చేసిన స్టాల్‌ను పరిశీలిస్తున్న ఎంపీపీ అనిత

గంగాధర నెల్లూరు: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం పేదలకు వరం అని ఎంపీపీ అనిత అన్నారు. మండలంలోని వింజం గ్రామ పంచాయతీలోని యస్.యస్.కొండ ఉన్నత పాఠశాలలో సర్పంచ్ రామక్క గోవిందస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆరోగ్య సురక్ష క్యాంపును మంగళవారం తహసీల్దార్ ఇన్బనాథన్‌తో కలిసి ఎంపీపీ అనిత ప్రారంభించారు. కార్యక్రమంలో భాగంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగరత్నం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పోషకాహార స్టాళ్లను పరిశీలించి, సామాన్య ప్రజలకు చిరుధాన్యాల ఆవశ్యకతను ఆమె తెలియజేయాలన్నారు. అనంతరం పలువురికి సురక్ష కిట్లను, కంటి అద్దాలు, మందులు ఉచితంగా అందించారు. స్థానిక నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

రూ.లక్ష విలువజేసే ఆటవస్తువుల వితరణ



ఆట వస్తువులను చూపుతున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు, అధికారులు

గంగాధర నెల్లూరు: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు బెంగుళూరుకు చెందిన జాయిన్ ద డాట్ సంస్థ ప్రతినిధులు రూ.లక్ష విలువైన ఆట వస్తువులను మంగళవారం వితరణ చేసినట్లు హెచ్‌ఎం హేమలత, వ్యాయామ ఉపాధ్యాయులు సెల్వ పాండియన్ తెలిపారు. ఈ సందర్భంగా వ్యాయామ ఉపాధ్యాయుడు మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతో పాటు మానసిక ఉల్లాసం కోసం ఆటలు కూడా ముఖ్యం అన్నారు. ఈ సందర్భంగా పాఠశాల పేరెంట్స్ కమిటీ చైర్మన్ పూర్ణిత, ఇన్‌చార్జ్ హెచ్‌ఎం దినకరన్, ఉపాధ్యాయులు, జాతీయ స్థాయిలోనే ఉత్తమ కోచ్‌గా విద్యార్థులకు సేవలు అందిస్తున్న వ్యాయామ ఉపాధ్యాయులు సెల్వపాండియన్‌ను శాలువతో సత్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్ సుబ్రమణ్యం, ఎంఈఓ ఆంజనేయులు శెట్టి, ఏఓ సుధాకర్, ఈఓపీఆర్డీ రాఘవేంద్ర రాజు పాల్గొన్నారు.

ఇందిరాగాంధీ సేవలు మరువలేనివి

నగరి: మాజీ ప్రధాని ఇందిరాగాంధీ సేవలు మరువలేనివని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.బాబు అన్నారు. మంగళవారం భారతదేశ మొదటి మహిళా ప్రధాని ఇందిరాగాంధీ వర్ధంతిని పురస్కరించుకుని టవర్ క్లాక్ సెంటర్‌లో ఆమె చిత్రపటానికి నివాళులర్పించారు. బస్టాండు ప్రాంగణంలో అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఏఐసీసీ సభ్యులు భానుమూర్తి, పీసీసీ సభ్యులు నటరాజ మొదలియార్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సదాశివపురం మరియు కళ్యాణ వెంకటేశ్వరపురం భూముల విషయమై హెచ్చరిక నోటీసు

ఇందుమూలంగా యావన్మందికి తెలియచేయడమేమనగా నా కక్షిదారులు శ్రీ వి.రఘునాధన్ కుటుంబ సభ్యుల సూచనలు మేరకు శ్రీ ఎస్.లోగనాధన్, చెన్నై గారికి ఇచ్చిన ఆదేశాల మేరకు కింది కనిన భూములు (ప్రైవేటు ఫారెస్ట్) తమ కుటుంబం పూర్వీకులు 1880 మరియు 1928లో రిజిస్టర్ పత్రాల ద్వారా కొనుగోలు చేసిన ఆస్తులుగా తెలియపరిచినారు. సదరు ఆస్తులను ప్రభుత్వ భూములుగా మద్రాస్ ఎస్టేట్ అబాలిషన్ ఆక్ట్ 1948 ప్రకారం G.O.Ms No. 351 తేది 03-08-1952 జారీ చేసారు. సదరు G.O నూ చిత్తూరు జిల్లా అదనపు జిల్లా కోర్టులో శ్రీ రఘునాధన్ కుటుంబ సభులు O.S. No. 15/1958 దావా ద్వారా సవాలు చేసినారు. సదరు గౌరవ కోర్టు వారు పూర్తి విచారణ తరువాత విద్యుత్ సదాశివపురం మరియు కళ్యాణ వెంకటేశ్వరపురం భూములు పై ఇచ్చిన G.O.Ms No. 351 తేది 03-08-1952ను రద్దు చేస్తూ వారి కుటుంబానిదేనని తీర్పు ఇచ్చినారు. సదరు తీర్పు లోనే ప్రభుత్వం మరియు అటవీ శాఖ పై ఇంజక్షన్ ఉత్తర్వులు ఇచ్చినారు. సదరు ఆస్తులను శ్రీ రఘునాధన్ కుటుంబం రిజిస్టర్ లీజుకు వివిధ వ్యక్తులకు 1930 నుండి 1979 వరకు ఇస్తూ ప్రస్తుతం వాచా లీజును కొనసాగిస్తూ అజమాయిషి చేసుకుంటూ వస్తున్నారు.

సదరు O.S. No. 15/1958 తీర్పును ప్రభుత్వం మరియు అటవి శాఖ వారు A.S.No. 415/1959 గౌరవ హై కోర్టు, ఆంధ్రప్రదేశ్ లో సవాలు చేసారు. సదరు అప్పీల్ ను గౌరవ హై కోర్టు వారు తోసి పుచ్చుతూ O.S. No. 15/1958ను నిర్ధారించినారు. సదరు హై కోర్టు వారి తీర్పు 1962 లో ఇవ్వడం అయినది. సదరు తీర్పును అంతిమ తీర్పుగా తెలియజేయుచున్నాను. అయినను 1967 లో ప్రభుత్వం మరియొక నోటిఫికేషన్ G.O.Ms No.726 (రెవిన్యూ) తేది 10-08-1967ను జారీ చేసారు. ఆ G.O ప్రకారం మరియు ఎస్టేట్ అబాలిషన్ ఆక్ట్ కింద ఒరిజినల్‌కు సవరణ G.O గా ఇచ్చి సదరు విద్యుత్ సదాశివపురం, కళ్యాణ వెంకటేశ్వర పురం భూములను ప్రభుత్వ, అటవీశాఖ భూములుగా ప్రకటించినారు.

సదరు నోటిఫికేషన్‌ను మా కక్షిదారులైన వి.రఘునాధన్ కుటుంబ సభులు మరల O.S. No. 49/1991 దావాను పుత్తూరు ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి కోర్ట్ లో సవాలు చేసినారు. సదరు దావా మా కక్షిదారులకు అనుకూలమైనది. ఆ తీర్పు మేరకు సదరు G.O.Ms No.726 (రెవిన్యూ) తేది 10-08-1967 తీర్పు చెల్లదని రద్దు చేసినారు.

ఆ తరువాత సదరు తీర్పును తిరుపతి ప్రధాన సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో ప్రభుత్వం మరియు అటవీ శాఖ వారు సవాల్ చేస్తూ మొదటి అప్పీలు నెం.1/2004 దాఖలు చేశారు. సదరు అప్పీలు కింది కోర్టు తీర్పును ఖరారు చేస్తూ అప్పీల్ ను రద్దు చేసినారు. ఆ తరువాత ప్రభుత్వం మరియు అటవీ శాఖ వారు రెండవ అప్పీల్ నెం. 1057/2016ను గౌరవ హై కోర్ట్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్, అమరావతిలో పై రెండు తీర్పులను సవాలు చేసినారు. సెకండ్ అప్పీల్ 15-09-2023 తారీకున రద్దు చేస్తూ పై తీర్పు లన్నింటిని నిర్ధారణ చేసినారు.

పై తీర్పులు మేరకు విద్యుత్ సదాశివపురం మరియు కళ్యాణ వెంకటేశ్వర పురం ప్రైవేటు ఫారెస్ట్ భూములు మా కక్షిదారులు కుటుంబానికి చెందినవిగా తీర్పును ఇచ్చినారు. మరియు ప్రభుత్వం, అటవీ శాఖ అధికారుల పై శాస్వత ఇంజక్షన్ ఆర్డర్ ద్వారా నా కక్షిదారులకు రక్షణ కల్పించినారు. ఇదియును గాక K.కృష్ణారెడ్డి వగైరాలు కళ్యాణ వెంకటేశ్వరపురం భూములు విషయముగా హక్కు కోరుతూ గౌరవ హై కోర్ట్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ హైదరాబాదులో W.P. 20563/2001 దాఖలు చేసినారు. సదరు రిట్ పిటిషన్లు కూడా పై భూములు ప్రభుత్వ భూములు కాదని మా కక్షిదారులకు సంబంధించినదిగా తీర్పు ఇవ్వడం అయినది.

ఇదిలా వుండగా కొందరు దౌర్జన్యంగా కళ్యాణ వెంకటేశ్వరపురం భూముల్లో అక్రమంగా ప్రవేశించడానికి ప్రయత్నం చేయగా మా కక్షిదారులు OS.No.43/2011 ప్రధాన జూనియర్ సివిల్ జడ్జివారి పుత్తూరు కోర్టులో దావాను P.జయరామయ్య వగైరాల పైన వేసి పర్మనెంట్ ఇంజక్షన్ ఉత్తరువులు పొందినారు. ఆ తీర్పు మేరకు ప్రైవేటు వ్యక్తులు కూడా సదరు మా కక్షిదారుల భూములలో ప్రవేశించ కూడదని ఆదేశించినారు.

పైన తెలిపిన తిర్పులకు మరియు మా కక్షిదారుల హక్కులకు భంగ కలిగిస్తూ ఇటివల కొందరు రాజకీయ నాయకుల ప్రేరేపితంతో కింద తెలిపిన భూముల పై అనధికార లావా దేవిలు సృష్టించి మరియు తప్పుడు రికార్డులు ద్వారా ఇతరులకు అన్యాక్రాంతం చేయుటకు ప్రయత్నిస్తున్నారని తెలియవచ్చింది. అట్లు ఎవరైనా తప్పుడు రికార్డులు ఎవరికీ వారు తయారు చేసినా లేక చేసుకున్నా లేదా రెవిన్యూ అధికారుల ద్వారా సృష్టించి సదరు భూములలో అక్రమంగా ప్రవేశించుటకు ప్రయత్నించిన యెడల కోర్టు తీర్పులను ఉల్లంఘించినట్లుగా భావించి వారి పై చట్ట రీత్యా కోర్టు ధిక్కరణ మరియు క్రిమినల్ కేసులు వేసి చర్యలు తీసుకోగలమని హెచ్చరించడమైనది.

ఈ తుది హెచ్చరిక ద్వారా గతంలో పనిచేసిన రెవిన్యూ అధికారులు కొందరు, భూబకాసురులు కలసి తప్పుడు రికార్డు లు, సృష్టించారని తెలియవచ్చింది. వాటి పై మా కక్షిదారులు చట్ట ప్రకారం రెవిన్యూ అధికారుల పైన మరియు వారి సహాయంతో తప్పుడు రికార్డులు పెట్టుకుని కింది భూములలో దౌర్జన్యంగా ప్రవేశించు వారి పై కోర్టు ధిక్కరణ కేసు వేస్తున్నామని ఇందు మూలంగా హెచ్చరించడమైనది.

కావున మా కక్షిదారుల ఆస్తులైనటువంటి విద్యుత్ సదాశివపురం మరియు కళ్యాణ వెంకటేశ్వర పురం ప్రైవేటు ఫారెస్ట్ భూముల పై గల హక్కులకు మరియు వారి స్వాధీనానుభవంకు ఎటువంటి భంగం కలిగించ రాదని అట్లు కలిగించిన ప్రతి వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోగలమని ఈ నోటీసు ద్వారా తెలియజేయడమైనది.

షెడ్యూలు: తిరుపతి జిల్లా - శ్రీ బాలాజీ రిజిస్ట్రేషన్ డిస్ట్రిక్ట్ - పుత్తూరు సబ్ డిస్ట్రిక్ట్ - పుత్తూరు రెవిన్యూ మండలం - నం.199 - విద్యుత్ సదాశివపురం భూములు మరియు నం.202 కళ్యాణ వెంకటేశ్వరపురం భూములు పూరా విస్తీర్ణం కోర్టు జడ్జిమెంట్ మేరకు.

తేది: 31.10.2023

ప్రదేశం: పుత్తూరు

బి.రవీంద్ర, B.Sc., B.L., **యు.ఎస్.రాయుడు,** M.Sc., B.L.,
కె.భాస్కర్, M.A., B.L., **పి.జి.వెంకటేష్,** B.Sc., LL.B,
యు.సాయి ప్రజ్వాల్, B.Com., LL.M, **ఎ.దీపక్,** MBA., LL.B,
అడ్వకేట్స్, పుత్తూరు.